## ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్ 6: ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ధరణి, ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై తహసీల్దార్లతో సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాల హద్దులను గుర్తించి రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. కాళేశ్వరం 27, 28 ప్యాకేజీలో భాగంగా మండలాల వారీగా భూసేకరణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వీసీలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఆర్వో భుజంగరావు, ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, నీటిపారుదల శాఖ ఎస్ఈ లక్ష్మి, ఈడీఎం నదీమ్, తహసీల్దార్లు అధికారులు పాల్గొన్నారు.



నర్సాపూర్ (జీ) మండలంలో దెబ్బ తిన్న రోడ్డు



## ఫసల్ బీమాపై పట్టింపేది ?

- ప్రీమియం చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం
- ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చినా ఫలితం శూన్యం
- రైతులను విస్మరించిన సర్కారు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. ఆదిలాబాద్ జిల్లా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఫసల్‌బీమా యోజనను అమలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. వాతావరణ పరిస్థితుల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్‌బీమా పథకం ఎకరాకు రూ.3500 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వాటా రూ.1750 రైతులు రూ.1750 చెల్లించాలి. ఏటా వానకాలం సీజన్‌లో పంటలు వేసిన తర్వాత జూలై 15 వరకు ఫసల్‌బీమా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించే అవకాశం ఉంటుం ది. ఫసల్‌బీమా ఇన్సూరెన్స్ చేయించుకున్న రైతులకు అధికవర్షాలు, ఇతర వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులు పంటలు నష్టపోతే ఇన్సూరెన్స్ కంపెనీలు డబ్బులు చెల్లిస్తాయి.

### ఉప ముఖ్యమంత్రి హామీ ఏమైంది ?

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా రైతు భరోసా ఇప్పటి వరకు అమలు చేయలేదు. ఈ పథకంపై రైతు ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా జూలై మొదటి వారంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఉట్నూర్‌లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో రైతులు ఫసల్‌బీమా అమలు చేయాలని పంటలు నష్టపోయిన రైతులకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నదాతలు కోరారు. రైతుల సూచనల మేరకు ప్రభుత్వం ఫసల్‌బీమా అమలు చేస్తుందని, ప్రీమియం చెల్లిస్తుందని ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. నిర్ణీత గడువులోగా ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవడంతో పథకం అమలు కాలేదు.

### వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో రైతులు భారీగా పంటలు నష్టపోయారు. పత్తి, సోయాబిన్, కంది పంటలు నీటమునిగాయి. ప్రభుత్వం ఫసల్‌బీమా పథకం అమలు చేసి ఉంటే రైతులకు ఇన్సూరెన్స్ డబ్బులు అందేవి. ఫసల్‌బీమా అమలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది.

# వరద నష్టంపై ఏదీ అంచనా ?

**నీట మునిగిన పంట పొలాలు**

- ఎక్కడికక్కడ ఇసుక మేటలు
- తెగిపోయిన రోడ్లు, వంతెనలు
- రంగంలోకి దిగని యంత్రాంగం
- సహాయం కోసం ఎదురు చూస్తున్న రైతులు

నిర్మల్, సెప్టెంబర్ 6 (నమస్తే తెలంగాణ):నిర్మల్ జిల్లాలో ఇటీవల వారం రోజుల పాటు కురిసిన భారీ వర్షాలతో ఇటు రైతాంగానికి అటు సాధారణ ప్రజానీకానికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. ముఖ్యంగా కడెం, దస్తూరాబాద్, పెంబి, మామడ, లక్ష్మణచాంద, సారంగాపూర్, దిలావర్‌పూర్, కుంటాల, నర్సాపూర్(జీ) తదితర మండలాల్లో వరద ఉధృతికి వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. కొన్ని చోట్ల పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. గ్రామాలను అనుసంధానించే రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. ఇప్పుడిప్పుడే తెగిపోయిన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేసుకొని ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు మాత్రం ఎక్కడా నష్టం జరగలేదంటూ కితాబు ఇస్తుండడం విమర్శలకు తావిస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో భారీ వర్షాలు కురిసిన వెంటనే అన్ని శాఖల అధికారులు రంగంలోకి దిగి పంట నష్టంపై అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించేవారు. దీని ఆధారంగా ప్రభుత్వం నష్ట పరిహారంతో పాటు రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టేది. రోడ్లు, వంతెనల మరమ్మతులకు నిధులు సైతం మంజూరు చేసి పనులు పూర్తి చేయించేది. ప్రస్తుతం మాత్రం ఎక్కడ కూడా అలాంటి పరిస్థితులు కనిపించడం లేదంటూ రైతులతో పాటు సాధారణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

### అధికారుల తీరుపై విమర్శలు..

ఇప్పటివరకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నీట మునిగిన పంటల వివరాలను గాని, ఇసుకమేటల విషయంలో గాని పరిశీలించి నివేదికలను వెల్లడించకపోవడంపై రైతులపై ప్రభుత్వానికి ఏమేరకు చిత్తశుద్ధి ఉన్నదో స్పష్టమవుతున్నది. అధికారులు మొదటి రోజు నుంచే జిల్లాలో ఎక్కడ కూడా పెద్దగా నష్టం జరుగలేదంటూ చేతులు దులుపుకుంటున్నారు. జిల్లాలోని పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీశాఖల పరిధిలోని రోడ్లు, వంతెనల పరిస్థితి సైతం భారీ వర్షాల కారణంగా దయనీయంగా మారింది. చాలా చోట్ల రోడ్లు తెగిపోవడం, వంతెనలు దెబ్బతినడంలాంటివి జరిగినప్పటికీ సంబంధిత శాఖల అధికారులు వాటి మరమ్మతులకు సంబంధించి అంచనాలను కూడా రూపొందించకపోవడంపై విస్మయం వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా పలు మారుమూల మండలాలకు సంబంధించి వాగులు, వంకలు ఉప్పొంగడంతో అక్కడిలో లెవెల్ వంతెనలు.. బీటీ, పలు మెటల్ రోడ్లు కొట్టుకుపోయాయి. పలు కాలువలకు సైతం గండ్లు పడ్డట్లు రైతులు పేర్కొంటున్నారు.

### మంత్రి హామీ బుట్టదాఖలు

జిల్లాలో వరద పరిస్థితిని తెలుసుకొని ఆదుకునేందుకు వచ్చిన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు. మంత్రి మొదట కడెం ప్రాజెక్టును సందర్శించి అనంతరం ఖానాపూర్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కడెం ప్రాజెక్టు పరిధిలో వరద తీవ్రతకు చాలా చోట్ల పంటలు నీటమునిగాయి. దీంతో పాటు పంట చేలల్లో ఇసుకమేటలు కూడా వేశాయి. దీంతో రైతులు భారీ వర్షాలు, వరదలతో తాము తీవ్రంగా నష్టపోయామని అధికారులకు విన్నవించుకున్నారు. ఖానాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ వర్షాలు, వరదలతో నష్టపోయిన వారందరినీ ఆదుకుంటామని ప్రకటించారు. ఆ తర్వాత నిర్మల్ పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీని కూడా సందర్శించి బాధితులకు అండగడా ఉంటామని భరోసా ఇచ్చారు. మంత్రి పర్యటించి నాలుగు రోజులైనా అధికారులు నష్టం అంచనాలను రూపొందించకపోవడం, ఆదుకుంటామన్న హామీ కనీస స్థాయిలో ప్రస్తావనకు రాకపోవడంపై జనం మండిపడుతున్నారు. కేవలం మంత్రి శ్రీధర్‌బాబు ప్రచారం కోసమే వచ్చి హామీలిచ్చారే తప్ప ఆయన పర్యటన ద్వారా ప్రజలకు ఒరిగిందేమీ లేదంటూ విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.





భారీ వర్షాలకు లక్ష్మణచాంద మండలంలో దెబ్బతిన్న పత్తి పంట, కోతకు గురైన రోడ్డు



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## మెరుగైన వైద్య సేవలందించాలి

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

బోథ్, సెప్టెంబర్ 6 : ప్రభుత్వ దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు, సిబ్బందిని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశించారు. శుక్రవారం బోథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. ఓపీ లైన్‌లో నిల్చున్న రోగులతో మాట్లాడారు. అనంతరం చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డాక్టర్ రవీంద్ర ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

### మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

మండలకేంద్రానికి చెందిన వడ్నాల పోసాని శుక్రవారం బట్టలు ఉతికేందుకు వాగుకు వెళ్లి ప్రమాదవశాత్తు ఆ వాగులో పడి మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్‌లు సురేందర్ యాదవ్, సదానందం, సాకరాం, చంద్రమోహన్, శ్రీధర్ రెడ్డి, ఎర్రోళ్ల లింగారెడ్డి, డాక్టర్ స్వామి, వినయ్, ఏలేటి రవీందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## రూ. 40లక్షలతో ఉడాయించిన వ్యాపారి

**బాధితుడి ఒత్తిడి భరించలేక మధ్యవర్తిగా ఉన్న వ్యక్తి ఆత్మహత్య**



అంకం పెద్ద రాజన్న (ఫైల్)

సోన్, సెప్టెంబర్ 6 : ఓ గొర్రెల వ్యాపారి రూ. 40 లక్షలతో ఉడాయించడంతో బాధితుడి ఒత్తిడి పెరగడంతో మధ్యవర్తిగా ఉన్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నిర్మల్ జిల్లా కడ్తాల్ గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడకు చెందిన షరీఫ్ (షబ్బీర్) నిర్మల్‌లో కొన్నేళ్లుగా ఇక్కడే ఉంటూ గొర్రెల వ్యాపారం చేస్తున్నాడు. మూడు నెలల క్రితం పాక్‌పట్లకు చెందిన మహేశ్ వద్ద నుంచి గొర్రెలను షరీఫ్ కొనుగోలు చేశాడు. కొన్ని డబ్బులు చెల్లించి మిగతా తర్వాత ఇస్తానని చెప్పాడు. మహేశ్ నమ్మకపోవడంతో గతంలో కడ్తాల్‌లో రాజన్న వద్ద ఇలాగే గొర్రెలను కొని పూర్తిగా చెల్లించినట్లు షరీఫ్ తెలిపాడు. డబ్బుల విషయంలో మధ్యవర్తిగా ఉంటానని మహేశ్‌తో రాజన్న ఫోన్‌లో చెప్పాడు. గడువు ముగిసినా డబ్బులు ఇవ్వకపోవడం, షరీఫ్ అచూకీ తెలియకపోవడంతో మధ్యవర్తిగా ఉన్న రాజన్నను డబ్బులు ఇప్పించాలని మహేశ్ అడిగాడు. షరీఫ్‌ను పట్టుకొని డబ్బులు ఇప్పిస్తానని మహేశ్‌కు రాజన్న చెప్పాడు. అయినప్పటికీ షరీఫ్, రాజన్నలు తనను మోసం చేశారని తనకు రావాల్సిన డబ్బులు ఇప్పించాలని మహేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు రాజన్నను పోలీస్ స్టేషన్‌కు రావాలని గురువారం సూచించడంతో భయాందోళనకు గురైన రాజన్న అదే రోజు రాత్రి తన ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు మహేశ్ రాజన్నను వేధించడంతోనే రాజన్న ఆత్మహత్య చేసుకున్నారని అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రామంలో ఆందోళన చేశారు. దీంతో సోన్ సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ కే.గోపి అక్కడికి చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మధ్యవర్తిగా ఉన్నందుకు రాజన్న ఆత్మహత్య చేసుకోవడంతో ఆ గ్రామంలో గ్రామస్తులను కలచివేసింది.

## పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షి షా**



మర్కాగూడలో అంగన్‌వాడీ టీచర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షి షా

ఇంద్రవెల్లి, సెప్టెంబర్ 6 : అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన పౌష్టికాహారం అందించినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ఆదిలాబాద్ కలెక్టర్ రాజార్షి షా అన్నారు. శుక్రవారం మండలంలోని మర్కాగూడ, గిన్నేరా గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ రాజార్షి షా సందర్శించారు. పిల్లలతోపాటు అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన పౌష్టికాహారం, రికార్డులను పరిశీలించారు. చిన్నారులకు భోజనం వడ్డించారు. అనంతరం గిన్నేరా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన పోషణ మాసం కార్యక్రమంలో కలెక్టర్ రాజార్షి షా పాల్గొని బాలమృతంతో చేసిన లడ్డూలను చిన్నారులకు అందించారు.

### దెబ్బతిన్న పంటలు, రోడ్ల పరిశీలన

మండలంలోని పాటగూడ, గిన్నేరా, మర్కాగూడ, లాల్‌టేకడి గ్రామాల్లో పర్యటించి, వరదతో కోతకు గురైన కల్వర్టు, బీటీరోడ్లు, వర్షంతో దెబ్బతిన్న పంటలను కలెక్టర్ రాజార్షి షా పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లు, నీటిలో మునిగిన పంటలు, వరదతో దెబ్బతిన్న పంటలపై సర్వేలు చేసి పూర్తి నివేదికలు అందించాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనులు చేపట్టాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని వ్యాధుల నివారణకు పీవర్ సర్వేలు చేపట్టాలన్నారు. క్లోరినేషన్ పనులతోపాటు నీటి పరీక్షలు చేసి ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, మాజీ ఎంపీపీ కనక తుకారాం, ఏసీడీపీవో మిల్కా, పీఆర్ ఈఈ శివరాం, డీఈ రమేశ్, ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్, నాయకులు మెస్రం భీంరావ్, కుమ్రం కేశవ్‌రావ్, బాదిపటేల్, తదితరులు పాల్గొన్నారు.

### ఫీవర్ సర్వేపై సమీక్ష

ఎదులాపురం, సెప్టెంబర్ 6 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం ఆర్‌బీఎస్‌కే బృందాలు, సాంఘిక సంక్షే మ అధికారులతో సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో ఫీవర్ సర్వేపై కలెక్టర్ రాజార్షి షా సమీక్షించారు. అన్ని గిరిజన సం క్షేమం, ఎస్సీ సంక్షేమం, బీసీ సంక్షేమం, మైనార్టీ సంక్షేమ పాఠశాలల్లో ఆర్‌బీఎస్‌కే బృందాలు నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేను ఆరా తీశారు. జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్‌కు ఎన్ని పాజిటివ్‌ల వివరాలు తెలుసుకున్నారు. మొత్తం 25671 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా 885 మంది గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. వీరిలో 603 డెంగ్యూ నమూనాలు సేకరించగా అందులో ఒకటి పాజిటివ్ నిర్ధారణ అయిందన్నారు. అనంతరం టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌జేఎస్ ఆదిలాబాద్, బోథ్, ఇచ్చోడ స్కూళ్లలో బిల్డింగ్‌కు సంబంధించి మేజర్, మైనార్టీ రిపేర్స్‌పై సమీక్షా నిర్వహించి ఎక్కడెక్కడ మరమ్మతులు అవసరమున్నా వాటిని ఐడెంటిఫై చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవియ, జిల్లా వైద్యాధికారి కృష్ణ, ఆర్‌బీఎస్‌కే బృందాలు, డీఐవో, పీవో-ఆర్‌బీఎస్‌కే, డీఎంవో, సాంఘిక సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

## వినాయక చవితిని ప్రశాంతంగా నిర్వహించాలి

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి
- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, సెప్టెంబర్ 6 : వినాయక చవితి పండుగను శాంతియుత వాతావరణంలో జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవోలు కలిసి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా అధికారులు భక్తి శ్రద్ధలతో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను విజయవంతమయ్యేలా చూడాలని, ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేపట్టాలని ఆదేశించారు. విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. తప్పుడు ప్రచారం చేసే సోషల్ మీడియా మీద నిఘా పెంచాలని, సోషల్ మీడియాలో వచ్చే అపోహలను నమ్మొద్దని తెలిపారు. వచ్చే 11 రోజులు చాలా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సమస్యలకు తావు లేకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. అన్ని మండపాల వద్ద హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామని, ఈ నెల 7వ తేదీ నుంచి 11 రోజుల పాటు జరిగే వినాయక నవరాత్రి వేడుకలు, 17న జరిగే మిలాద్ ఉన్ నబి వేడుకలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా చూడాలని సూచించారు. వినాయక నవరాత్రుల సందర్భంగా ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, మున్సిపల్ శాఖ శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## వినాయక చవితికి సర్వం సిద్ధం

*ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా వినాయక చవితి ఉత్స వాలకు భక్తులు అన్ని ఏర్పాట్లు చేశారు. వాడ వాడనా మండపాలను ఏర్పాట్లు చేసి నిర్వాహకులు అందంగా అలంకరించారు. ఆదిలాబాద్ పట్టణంలోని కుమార్‌వాడలో కుమార్ జనతా గణేశ్ మండలి వారు 52 ఫీట్ల త్రిముఖి గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠాపనకు సిద్ధం చేశారు. వినాయక్ చౌక్‌లో విగ్రహాల దుకాణాలు వెలిశాయి. దీంతో మార్కెట్లో వినాయక చవితి సందడి నెలకొన్నది. - ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, సెప్టెంబర్ 6*



◄ కుమార్‌వాడలోని 52 ఫీట్ల త్రిముఖ గణపతి | వినాయక్ చౌక్‌లో అమ్మకానికి సిద్ధంగా విగ్రహాలు


